# సింగిల్ పేజీ కథలు

## సాఫ్ట్‌వేర్

భాస్కర్‌కి ఈమధ్యనే పెళ్ళి అయ్యింది. పూనాలో ఒక మల్టీనేషనల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. భార్య లావణ్య కూడా ఎమ్.సి.ఏ చేసినా భాస్కర్ సొంత ఊరు కాకినాడలోనే ఒక కాలేజీలో కంప్యూటర్ ఫాకల్టీగా పనిచేస్తోంది. విద్యా సంవత్సరం మధ్యలోనే కాలేజీని వదిలేస్తే స్టూడెంట్సు, మేనేజ్‌మెంటు ఇబ్బంది పడతారని విద్యాసంవత్సరం పూర్తి అయ్యేవరకు ఉద్యోగం కంటిన్యూ చేద్దామని అత్తగారింట్లోనే ఉండిపోయింది.

ఎప్పుడూ ఉరుకులు-పరుగులు తీస్తూ, చిన్న చిన్న గదుల్లో ఎడ్జస్ట్ కావాల్సిన పూనా వాతావరణం చూశాక తన ఊరు, ఇల్లు ఎంతో ఆనందం కలిగించాయి భాస్కర్‌కి. ఊరు శివార్లలో ఉండటంతో తన ఇంటి దగ్గర ఉండే పల్లెటూరి వాతావరణం, పెద్దచెట్లు, బావి-ఇవన్నీ ఇప్పుడు అపురూపంగా కనిపిస్తున్నాయి.

లావణ్య నెల తప్పిందన్న శుభ వార్త తెలిసింది. ఉగాదికి వరుసగా మూడు రోజులు శెలవులు రావటంతో మరో రెండురోజులు శెలవు పెట్టి మరీ ఇంటికొచ్చాడు భాస్కర్.

ఉదయం ఐదుగంటలకే లేచి జాగింగ్‌కి వెళుతున్న భాస్కర్‌కి పెరటివేపు తల్లితో ఎవరో మాట్లాడుతున్నట్టు అనిపించింది. 'ఇంత ఉదయాన్నే...ఎవరా!' అనుకుంటూ అటువైపు నడిచాడు.

పనిమనిషి రాములమ్మ మాట్లాడుతోంది. "ఏం సోజ్జెం అమ్మా! ఎంత గర్భిణీ అయితే మాత్రం అలా బారెడు పొద్దెక్కేవరకూ నిద్ర లేవకుండా ఉండొచ్చా. పైగా అత్తచాటు కోడలు!"

రాములమ్మ మాట్లాడుతున్నది, అత్తచాటు కోడలు..అంటే లావణ్య గురించే అని అర్థం అయ్యేసరికి విపరీతమైన కోపం వచ్చింది. వెంటనే పనిలోంచి తీసెయ్యమని అమ్మకి చెప్పాలి. అవును. రాములమ్మ అలా మాట్లాడుతుంటే అమ్మ ఖండించకుండా అలా మౌనంగా ఉండిపోయిందేమిటి? అమ్మ భావం కూడా అదేనా, లేక ఆ విషయానికి అంత ప్రాధాన్యత ఇచ్చినట్టు పనిమనిషికి అనిపించకూడదని ఆగిందా? ఒక్కసారిగా ఎన్నో ప్రశ్నలు భాస్కర్ మదిలో.

ఇంతలో వాకిలివైపు బావి దగ్గర నుంచి మాటలు వినిపించటంతో స్పష్టంగా వినటం కోసం అటువైపు వెళ్ళాడు. రాములమ్మే లావణ్యతో అంటోంది-



"ఎందుకమ్మా ఇంత పొద్దునే లేవటం. ఉత్తమనిషివి కూడా కాదు. లేత గర్భిణీకి ఎంత బద్ధకంగా ఉంటుంది. ఇంకూసేపు పడుకోకపోయావా!"

ఆశ్చర్యపోయాడు భాస్కర్. ఎంత తెలివైనది రాములమ్మ. ఒకే విషయాన్ని ఎవరికి ఇష్టమైనట్టు వారికి ఎంతబాగా చెప్పింది! దేటాని ఎవరికి అవసరమైనట్టు వారికి ప్రాసెస్ చేసి ఇవ్వగలిగే కంప్యూటర్ ఎంత ఈమె ముందు!

ఆశ్చర్యం ఉద్రేకంగా మారి "అమ్మా!" అన్న అరుపుగా బయటకొచ్చింది. కంగారుగా అక్కడికొచ్చింది, భాస్కర్ తల్లి పార్వతి.

"అమ్మా! నీతో ఇంతకుముందు ఈ రాములమ్మ ఏమంది- అదే లావణ్య పడుకోవటం గురించి!" అన్నాడు. కొంచెం తటపటాయించింది పార్వతి.

"చెప్పమ్మా..ఎంత కడుపుతో ఉంటేమాత్రం ఇంత పొద్దెక్కి లేవటమా అన్లేదూ! ఇప్పుడు అదే విషయం మీద లావణ్యతో ఏమందో అడుగు. తర్వాత రాములమ్మని ఏం చేయాలో డిసైడ్ చెయ్యి" అంటూ బయటకు వెళ్ళిపోయాడు.

విషయం లావణ్య ద్వారా తెలుసుకున్న పార్వతి. కోపంగా "లే..ఇంటికెళ్ళిపో..ఈ నెల జీతం ఇచ్చేస్తాను. ఇంకెప్పుడూ రాకు.." అని అరచింది.

"సెమించండమ్మగారూ..ఇలాంటి బుద్ధి తక్కువ పనులెప్పుడూ సెయ్యను. దయచేసి పనులోంచి తీసెయ్యమాకండి" అంటూ చేతులు జోడించి ఏడవసాగింది రాములమ్మ.

"కుదరదు. మర్యాదగా వెళ్ళిపో..ఇంకా మాట్లాడితే అవి కూడా ఇవ్వను" అంటూ లోపలికెళ్ళి ఆ డబ్బులు తీసుకొచ్చి రాములమ్మ చేతిలో పెట్టింది.

వెళ్ళిపోతున్న రాములమ్మ "ఆగు" అన్న గంభీరమైన శబ్దం వినబడటంతో ఆగింది. భాస్కర్ తండ్రి రాజేశ్వరరావు. "పార్వతీ.. తప్పులు చేయటం మానవ సహజం. ఈ ఒక్కసారికీ క్షమించు. పని తప్ప వేరేమాట మాట్లాడదు..మాట్లాడనివ్వొద్దు.." అన్నాడు.

ఇంటికొచ్చి విషయం లావణ్య ద్వారా తెలుసుకున్న భాస్కర్ "అంతే..ఈ సిస్టమ్మూ, హార్డ్‌వేరూ ఎన్నటికీ మారవ్" అనుకున్నాడు.

"లేదండీ- సాఫ్ట్‌వేర్ మార్చేసారు మావయ్యగారు" అంది లావణ్య.

-బి.ఎల్.శకుంతల (విజయవాడ)